సాక్షి
వికారాబాద్

సోమవారం ၊ 25 ၊ ఆగస్టు ၊ 2025



రైతుల కష్టం..

ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు వర్షాలకు పాడయ్యాయి. కోతకొచ్చిన పంటలు నీటిపాలయ్యాయి. 8లో▸



స్థల అభివృద్ధికి కృషి

హిందూ ఉత్సవ కేంద్ర సమితికి కేటాయించిన స్థలంలో మండపాలను నిర్మిస్తామని తాటికొండ స్వప్నపరిమళ్ అన్నారు. 8లో▸



యూరియా కొరత లేదు

రాష్ట్రంలో యూరియా కొరత ఎక్కడా లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం పేర్కొన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

నేడు కోట్‌పల్లిలో ప్రజావేదిక

బంట్వారం: ఎన్‌ఆర్‌ఈజీఎస్ 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సోమవారం కోట్‌పల్లి ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ప్రజావేదిక (ఓపెన్ ఫోరం) నిర్వహిస్తున్నట్లు ఏపీఓ ఎలీష ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏడాది కాలంలో రూ.9 కోట్లతో చేపట్టిన పనులు ఖర్చు చేసిన బడ్జెట్ పై గ్రామాల్లో సోషల్ ఆడిట్ జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి ఆడిటర్లు ప్రజావేదికలో పూర్తి వివరాలను వెల్లడిస్తారని చెప్పారు. ఉదయం 10 గంటలకు ప్రాంభించే ఓపెన్ ఫోరంకు ఆయా శాఖల అధికారులు స్పెషల్ ఆఫీసర్లు హాజరు కావాలని కోరారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న కోట్‌పల్లి నాయకులు

బంట్వారం: ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి అన్నారు. కోట్‌పల్లి మండల కేంద్రంలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయానికి సహకారం అందించాలని కోరుతూ స్థానిక నాయకులు ఆదివారం మనోహర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కలిశారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ఆలయ ప్రహరీ నిర్మాణానికి రూ.10లక్షల మంజూరు పత్రం అందజేశారు. త్వరలోనే పద్మశాలి, మైనార్టీలకు కమ్యూనిటీహాళ్లు మంజూరు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అంజయ్య, నాయకులు జ్ఞానేశ్వర్, బందెయ్య, శివానందం, సమ్మయ్య, అమర్‌నాథ్‌రావు, కిరణ్, చిత్రశేఖర్, రమేశ్ పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం

మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



మట్టివినాయకులను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతినే పూజిద్దామని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో పూడూర్ జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు మేఘమాలగుప్తా ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు ప్రభాకర్‌గుప్తా, మున్సిపల్ మాజీ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, ప్రవీణ్‌రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నేత్రోనిలనం



ఖైరతాబాద్: ఈసారి ఖైరతాబాద్ మహాగణపతి 69 అడుగుల ఎత్తులో 28 అడుగుల వెడల్పుతో శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా భక్తులకు దర్శనమిచ్చేందుకు సిద్ధమయ్యాడు. మహా గణపతిని పూర్తిగా మట్టితోనే తీర్చిదిద్దినట్లు శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ తెలిపారు. షెడ్డు ఏర్పాటు మొదలుకొని వాటర్ ప్రూఫ్ కలర్స్‌తో తుది మెరుగులు దిద్దే వరకు వెల్డర్లు, మోల్డింగ్, ఆర్టిస్టులు, పెయింటర్లు.. దాదాపు 150 మందికి పైగా కళాకారులు పని చేశారన్నారు. దేశంలోనే మట్టితో ఇంత ఎత్తులో విగ్రహాన్ని తయారు చేసి ఊరేగించి.. నిమజ్జనం చేయడం ఖైరతాబాద్ వినాయకుడి ఘనత అని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 27న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమవుతాయని, సెప్టెంబరు 6న నిమజ్జనం జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం మహా గణపతి ప్రతిమకు కంటిపాపను (నేత్రోనిలనం) అమర్చడం ద్వారా ప్రాణ ప్రతిష్ఠ చేసినట్లవుతుందని శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ తెలిపారు.

బ్రాహ్మణ సేవా సంఘం సెక్రటరీకి సన్మానం

షాద్‌నగర్: బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య యువజన కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికైన సంబరాజు రవికుమార్ శర్మను ఆదివారం ఘనంగా సన్మానించారు. రవికుమార్ శర్మ చిన్ననాటి మిత్ర బృందం ఆదివారం పట్టణంలోని విజయ్‌నగర్ కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రఘునందన్, చంద్రారెడ్డి, సాయిరెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంచనాల్లో అందలం..
పనుల్లో పాతాళం

ఇరవై ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని కోట్‌పల్లి ప్రాజెక్టు

- 9,200 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించే ప్రాజెక్టు రెండు గ్రామాలకే పరిమితం
- తాజాగా రూ.89.3 కోట్లతో పాలనాపరమైన అనుమతులు
- పనులు పూర్తికి నేతలు చొరవ చూపాలని కోరుతున్న రైతులు



కోట్‌పల్లి ప్రాజెక్టు

వికారాబాద్: జిల్లాకు మణిహారంగా ఉన్న కోట్‌పల్లి సాగునీటి ప్రాజెక్ట్ తీవ్ర వివక్షకు గురవుతోంది. ప్రాజెక్టు అభివృద్ధి నీటిమూటలుగానే మిగిలిపోతున్నాయి. వికారాబాద్, తాండూరు రెండు నియోజకవర్గాలకు చెందిన 18 గ్రామాల వ్యవసాయ పొలాలకు నీరందించాల్సిన ఈ ప్రాజెక్టు అభివృద్ధి అంచనాలు.. ప్రతిపాదనలకే పరిమితమవుతూ వస్తోంది. దీంతో కాల్వలు పూడుకుపోయి.. ఆనకట్ట, అలుగు మరమ్మతులకు గురవుతున్నాయి. తూములు మరమ్మతులు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం కేవలం రెండు గ్రామాలకు మాత్రతమే సాగునీరందుతోంది. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన మిషన్ కాకతీయ కార్యక్రమంలోనూ ఈ ప్రాజెక్టును విస్మరించారు. ప్రాజెక్టు అభివృద్ధి తాజాగా మరోసారి తెరపైకి వచ్చింది. ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులు ఇచ్చి మూడు నెలలు గడిచినా పనుల్లో ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. దీంతో ప్రాజెక్టు పట్టాలెక్కనుందా.? గతం మాదరిగా ప్రకటనలకే పరిమితమా అనే చర్చలు వినిపిస్తున్నాయి. నిధులు మంజూరు చేయించామని చెబుతున్న రెండు నియోజకవర్గాల ప్రజా ప్రతినిధులు పనులు పూర్తయ్యేలా చూడాలని ఆయకట్టు రైతులు కోరుకుంటున్నారు. ఈ ప్రాజెక్టు సామర్థ్యం 1.57 టీఎంసీలు కాగా ప్రాజెక్టు పూర్తయితే కుడి, ఎడమ, బేబీ కెనాల్ మూడు కాల్వల ద్వారా 9,200 ఎకరాల ఆయకట్టుకు నీరందనుంది.

20 పర్యాయాలు ప్రతిపాదనలు

కోట్‌పల్లి ప్రాజెక్టు 20 ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. ఒకటి రెండు సార్లు స్వల్ప నిధులు మంజూరైనా పొదల తొలగింపు, కాల్వలు, తూముల మరమ్మతులు చేయించామని చెప్పి చేతులు దులుపుకొన్నారు. రూ.3 కోట్లతో ప్రారంభమైన ప్రతిపాదనలు రూ.110 కోట్లకు చేరాయి. గడిచిన రెండు దశాబ్దాలలో 15 పర్యాయాలు ప్రతిపాదనలు పంపినా అభివృద్ధి పనులు మాత్రం చేపట్టలేదు. గడిచిన ఐదేళ్లలో ఐదు సార్లు ప్రతిపాదనలు పంపంగా రాష్ట్ర స్థాయి అధికారులు ప్రాజెక్టును సందర్శించి వెళ్లారే తప్ప ఎటువంటి పురోగతి కనిపించలేదు. గత మూడు నెలల క్రితం రూ.89.3 కోట్లతో కోట్‌పల్లి ప్రాజెక్టుకు పాలనా పరమైన అనుమతులు వచ్చాయి. టెండర్ ప్రాసెస్ పూర్తయినప్పటికీ పనులు ప్రారంభించడంలో జాప్యం జరుగుతూనే ఉంది. రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టడంలో ప్రతీసారి అడ్డంకులు ఎదురవుతుండగా అందులో ఓ ప్రైవేటు సంస్థ బోటింగ్ పేరుతో నిర్వహిస్తున్న వ్యాపారానికి మాత్రం ఏ అడ్డంకులు కలగటంలేదు.

15 వేల ఎకరాలకు సాగు నీరు

దశాబ్దాల కాలంగా మరమ్మతులు చేపట్టక కాల్వలు పూర్తిగా పాడయ్యాయి. అలుగు పారే చోట పెద్ద ఎత్తున ధ్వంసమైంది. ప్రాజెక్టు కట్ట సైతం చాలా చోట్ల మరమ్మతులకు గురైంది. ప్రస్తుతం మంజూరైన నిధులతో కుడి, ఎడమ కాల్వలతో పాటు బేబీ కెనాల్ పాడైన చోట మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. పూర్తిగా పాడైన చోట కొత్తగా కాల్వలు నిర్మించాల్సి ఉంది. ప్రాజెక్టు కట్ట పాడైన నేపథ్యంతో కట్టను బలంగా తయారు చేయాల్సిన అవసరం ఉంది. అలుగు మరమ్మతులు చేపడితేనే నీటి ప్రవాహం ఆపే వీలుంటుందని ఇంజినీర్లు వెల్లడిస్తున్నారు. ప్రాజెక్టును పునరుద్ధరిస్తే 15 వేల ఎకరల వరకు సాగునీరందించే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో ఓ ప్రైవేటు ఆర్గనైజేషన్ ద్వారా బోటింగ్ చేస్తున్న నేపథ్యంలో రైతులకు నీరు వదలడం లేదని రైతుల నుంచి ఆరోపణలు ఉన్నాయి. మంజూరైన నిధులు వెనక్కి వెళ్లకుండా ప్రాజెక్టు పునరుద్ధరణ ప్రక్రియ పూర్తయ్యేలా నేతలు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.



అలుగు నీటిలో పర్యాటకుల సందడి

జన సందడి

కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఆదివారం పెద్ద ఎత్తున పర్యాటకులు విచ్చేశారు. కుటుంబ సభ్యులతో వచ్చి ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సందడిగా గడిపారు. అలుగు నీటిలో ఆటలాడుతూ ఎంజాయ్ చేశారు. బోటింగ్ చేస్తూ ఆనందంగా గడిపారు. – ధారూరు



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

'లక్నాపూర్'కు నిధులు కేటాయించాలి

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



లక్నాపూర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పరిగి: లక్నాపూర్ ప్రాజెక్టు మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని లక్నాపూర్ ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ కొండా మాట్లాడుతూ.. లక్నాపూర్ ప్రాజెక్టు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అనువుగా ఉందని ఇందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జాలర్లకు చేపల వేటకు కావాల్సిన అధునాత పరికరాలు అందించేలా చూస్తానన్నారు. చేపలను మార్కెటింగ్ చేసుకునేందుకు పరిగి పట్టణ కేంద్రంలోనే మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షురాలు అనసూయ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు



మాట్లాడుతున్న నర్సింలు

ఏఎంసీ డైరెక్టర్ మహేందర్‌రెడ్డి

బంట్వారం: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని మర్పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాఖం నర్సింలు అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని బస్వాపూర్‌కు మంజూరైన మినీ లైబ్రరీ ఏర్పాటుకు గ్రామస్తులతో కలిసి పాఠశాలలోని రెండు గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్వాపూర్‌కు మంజూరైన మినీ లైబ్రరీని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఇందుకు సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ లైబ్రరీలో దిన పత్రికలు, కాంపిటేటివ్ పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, మర్పల్లి ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, కృష్ణ, ఆనందం, రాజు, విద్యా కమిటీ మాజీ చైర్మన్ శివరాజ్ పాల్గొన్నారు.

యువత ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరాలి

పాలమూరు విభాగ సహ కార్యవిహ అనంత్‌రెడ్డి



మాట్లాడుతున్న అనంత్‌రెడ్డి

మోమిన్‌పేట: ప్రతీ ఒక్కరు దేశ భక్తి కలిగి ఉండాలని పాలమూరు విభాగ సహ కార్యవిహ కెరెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మోమిన్‌పేట, మర్పల్లి మండలాల స్వయం సేవకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భక్తితో పాటు హైందవ ధర్మం కాపాడటంలో యువత ముందుండాలన్నారు. యువత అర్‌ఎస్‌ఎస్‌లో చేరాలని పిలుపునిచ్చారు. ఈ శాఖలో చేరడం ద్వారా క్రమశిక్షణ, దేశ భక్తి పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. దేశంలో యుద్ధాలు, కరువులు, ప్రకృతి ప్రకోపించినప్పుడు మేమూ ఉన్నామని ఆర్‌ఎస్‌ఎస్ ముందుండి సహాయం చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యకరిణి వెంకటయ్య, మోమిన్‌పేట, మర్పల్లి స్వయం సేవకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏటీసీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెండు



ఐటీఐ ఏటీసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాయకులు

తాండూరు ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి

తాండూరు: ఏటీసీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పట్టణ శివారులో రూ.85 కోట్ల నిధులతో ఏర్పాటు చేసిన అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు సాంకేతిక విద్య, టెక్నికల్ విద్యా ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ఏటీసీలను ప్రారంభించిందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో బోధన ప్రారంభమైందని చెప్పారు. ఈ సందర్భంగా ఐటీఐ ఏటీసీ కేంద్రం ఏర్పాటు కృషి చేసిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు హబీబల్‌లాల నాయకులు అబ్దుల్ రవూఫ్, సర్దార్‌ఖాన్, ప్రభాకర్‌గౌడ్, రామకృష్ణ, మలప్ప, వేణుగోపాల్, శ్రీనివాస్, సంతోశ్‌కుమార్, సత్యమూర్తి, గాజుల మాధవి తదితరులున్నారు.

డర్టీ మర్డర్స్!



రాజధానిలో తరచుగా డర్టీ మర్డర్స్ వెలుగుచూస్తున్నాయి. మానవత్వం మరిచిన కొందరు తమవారి విషయంలోనూ విచక్షణ కోల్పోతున్నారు. క్షణికావేశం, కక్షలు, కార్పణ్యాలు, పక్కా పథకం ప్రకారం ఇలా కారణమేదైనా హత్య చేసిన తర్వాత మృతదేహాలను మాయం చేస్తున్నారు. ఇందులో భాగంగానే హత్య చేసిన తర్వాత మృతదేహాలను కాల్చేయడం, ముక్కలు చేసేయడం, కుక్కర్‌లో ఉడికించడం... ఇలా ఎంతటి దారుణానికైనా ఒడిగడుతున్నారు. ఇలాంటి ఘోరాల్లో అత్యధికం సాక్ష్యాధారాలు మాయం చేయడానికేనని, యాంటీ సోషల్ పర్సనాలిటీ డిజార్డర్ కూడా కారణమని సైకాలజిస్టులు చెబుతున్నారు. నగరంలో జరిగిన కొన్ని దారుణ ఘటనలు ఇలా ఉన్నాయి..

– సాక్షి, సిటీబ్యూరో

మంటగలుస్తున్న మానవ సంబంధాలు

- చంపేసి.. కాల్చేసి.. ఆపై ముక్కలుగా నరికి..
- నగరంలో తరచుగా అమానుష హత్యలు
- ఆధారాలు మాయం చేయడానికి ఎత్తుగడలు
- తాజాగా మేడిపల్లిలో కలకలం రేపిన హత్యోదంతం

సిమెంట్ దిమ్మెలో నవీష్ శవం..

'జనహర్ష' అధినేత రమణ మూర్తితో ఆర్థిక విభేదాల నేపథ్యంలో అతడి పార్ట్‌నర్ నవీష్‌మూర్తి 2005లో దారుణ హత్యకు గురయ్యాడు. రమణ మూర్తి, ఇన్‌స్పెక్టర్ విజయ్‌సింగ్ మరికొందరు కలిసి నవీష్‌మూర్తిని ఉప్పల్ ప్రాంతంలోకి తీసుకువెళ్లారు. అక్కడ నిర్మాణంలో ఉన్న తమ పరిచయస్తుడి ఇంట్లో హత్య చేశారు. శవాన్ని వంటింట్లో పడేసి, కాంక్రీట్‌ను దిమ్మగా పోసేశారు. ఆ ఇంటి వెనుక నివసించే ఓ మహిళ ఇచ్చిన సమాచారంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

ముక్కలు చేసి.. మూసీలో పడేసి..

మేడిపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో నివసించే మహేందర్‌రెడ్డి గర్భవతి అయిన తన భార్య స్వాతి అలియాస్ జ్యోతిని దారుణంగా చంపేశాడు. ఆపై మృతదేహాన్ని ముక్కలు చేసి, మొండెం మినహా మిగిలిన భాగాలు మూసీ నదిలో పడేశాడు. ఆదివారం ఉదయం ఈ ఉదంతం వెలుగులోకి రాగా... నిందితుడిని విచారిస్తున్న పోలీసులు మృతదేహం అవశేషాల కోసం మూసీ తీరం మొత్తం గాలిస్తున్నారు.

పాలేరులో పడేశారు..

కర్నూలు జిల్లాకు చెందిన రామ్‌భూపాల్‌రెడ్డికి నగరానికి చెందిన ఫిల్మ్ ఫైనాన్సియర్ మంజులారెడ్డితో పరిచయమైంది. వీరిద్దరూ 2001లో వివాహం చేసుకున్నా కొన్నాళ్లకు మనస్పర్థలు వచ్చి వేర్వేరుగా ఉన్నారు. ఓ దశలో మంజులారెడ్డిని హతమార్చాలని నిర్ణయించుకున్న రామ్‌భూపాల్‌రెడ్డి తన మిత్రులైన మల్లికార్జునరెడ్డి, మధుసూధన్‌రెడ్డిలతో కలిసి 2006 జూన్ 27న చంపేశాడు. మృతదేహాన్ని గోనె సంచిలో మూటగట్టి ఖమ్మం సమీపంలోని పాలేరు జలాశయంలో పడేశారు.

ముక్కలుగా దొరికిన రాకేష్

నారాయణగూడ పోలీసుస్టేషన్ పరిధిలో వాచ్‌మన్‌గా పని చేసిన ఓ వ్యక్తి కుమారుడు రాకేష్ 2010 డిసెంబర్‌లో ముక్కలు ముక్కలుగా దొరికాడు. తొలుత రామ్‌కోఠి చౌరస్తాలోని సిద్ధార్థ ఏజెన్సీస్ వద్ద కాళ్లు, తల లేని మొండెం, రెండు రోజులకు నారాయణగూడలో కాళ్లు లభించాయి. ఇతడి కుడి కాలికి ఉన్న ఆరు వేళ్లను బట్టి తల్లిదండ్రుల తమ బిడ్డగా గుర్తించారు. రాకేష్ తల మాత్రం దొరకలేదు. ఈ ఘాతుకానికి ఒడిగట్టింది ఎవరనేదీ తేలలేదు.



రిఫ్రిజిరేటర్‌లో విగతజీవిగా..

కరీంనగర్ జిల్లా సిరిసిల్లకు చెందిన వస్త్ర వ్యాపారి శ్రీనివాస్ 2011లో హైదరాబాద్‌లో దారుణ హత్యకు గురయ్యారు. ఈ ఘాతుకానికి ఒడిగట్టిన దుండగులు ఆయన మృతదేహాన్ని తమ ఫ్లాట్‌లో ఉన్న ఫ్రిజ్‌లో పెట్టి పరారయ్యారు. సిరిసిల్లకే చెందిన ప్రొఫెషనల్ నేరగాడు శ్రీధర్ సూత్రధారిగా ఈ హత్య జరిగింది.

డ్రమ్ములో డెడ్‌బాడీ..

వనస్థలిపురం పోలీసుస్టేషన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీలో ఉన్న నిర్మానుష్య ప్రాంతంలో 2012 జూన్ 28న ఓ డెడ్‌బాడీ బయటపడింది. నిలబెట్టి ఉన్న ప్లాస్టిక్ డ్రమ్‌లో ప్లాస్టిక్ గన్నీ బ్యాగ్‌లతో పార్సిల్ చేసి టేప్ వేసిన స్థితిలో లభించింది. వికలాంగుడైన హతుడిది నల్లగొండ, మహబూబ్‌నగర్ అయి ఉండవచ్చని పోలీసులు భావించారు.

ఉడికించి.. పొడిగా చేసి..

రాచకొండ పోలీసు కమిషనరేట్‌లోని మీర్‌పేట పరిధి జిల్లెలగూడలో ఈ ఏడాది జనవరిలో వెంకట మాధవిని ఆమె భర్త గురుమూర్తి చంపేశాడు. మృతదేహాన్ని ముక్కలు చేసి క్యాస్టిక్ సోడా వేసి ఉడకబెట్టి, ఎముకల్ని పొడిగా చేశాడు. ఆపై డ్రైనేజీలో కలిపేశాడు.

గోనె సంచుల్లో మూటకట్టి..

2003లో వెలుగులోకి వచ్చిన ప్రభాకర్ హత్య తీవ్ర కలకలం సృష్టించింది. యూసుఫ్‌గూడలో ప్రింటింగ్ ప్రెస్ నిర్వహించే ప్రభాకర్ ఫైనాన్స్ వ్యాపారి కూడా. పుట్టిన రోజు కార్డులు ప్రింటింగ్ చేయించుకోవడానికి వచ్చిన శైలజతో అతడికి పరిచయమైంది. ప్రభాకర్ నుంచి శైలజ రూ.లక్షల్లో అప్పు తీసుకుంది. తిరిగి చెల్లించాలని ఒత్తిడి పెరగడంతో ప్రభాకర్‌ను ఇంటికి పిలిచి, కూల్‌డ్రింక్‌లో నెయిల్ పాలిష్ రిమూవర్ కలిపి మత్తులోకి దింపింది. ఆపై చంపేసి చేసి శవాన్ని ఐదు భాగాలుగా కోసి, గోనె సంచుల్లో కట్టి వంటింటి నుంచి టెర్రస్ వరకు ఐదు చోట్ల దాచింది.

ఆధారాలు మాయం చేయడానికే..

ఇలాంటి ఉదంతాల్లో మృతదేహాలను ముక్కలు చేయడం, కాల్చేయడం, ఉడికించడం.. తదితరాలన్నీ ఎక్కువగా కీలక ఆధారమైన డెడ్‌బాడీని మాయం చేయడానికే చేస్తుంటారు. మృతదేహాన్ని యథాతథంగా తీసుకువెళ్లి ఎక్కడైనా పడేసి వచ్చే అవకాశం లేకపోతేనే ఈ వైపు మొగ్గుతుంటారు. ప్రస్తుత ఇంటర్నెట్ ప్రపంచంలో యూట్యూబ్ ఆధారంగానూ ఇలాంటి ఘోరాలు జరుగుతున్నాయి. కుటుంబీకులు.. అందునా భర్తలు ఇలాంటి దారుణాలు చేయడానికి అనుమానమే ప్రధాన కారణమవుతోంది. సమాజంలో పెరిగిపోయిన యాంటీ సోషల్ పర్సనాలిటీ డిజార్డర్ కారణంగానూ విచక్షణ కోల్పోతున్నారు. ఈ నేరం చేసే వరకు ఆ నిందితులు సాధారణ జీవితమే గడుపుతుండటం గమనార్హం. ఇలాంటి కేసుల్లో నేరం నిరూపణ కూడా కష్టసాధ్యం అవుతుంది.

– ఆర్. ప్రభాకర్, మాజీ డీఎస్పీ

క్లుప్తంగా

హిందూ ఉత్సవ సమితి స్థల అభివృద్ధికి కృషి



పనులను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

తాండూరు: హిందూ ఉత్సవ కేంద్ర సమితికి కేటాయించిన స్థలంలో పండుగలు జరుపుకునేందుకు వేదికగా మండపాలను నిర్మిస్తామని తాండూరు మున్సిపల్ మాజీ చైర్ పర్సన్, హిందూ ఉత్సవ సమితి చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్ అన్నారు. ఆదివారం పట్టణ శివారులోని ఖాంజాపూర్ గేట్ వద్ద హిందూ ఉత్సవ కేంద్ర సమితి స్థలంలో బోరు వేయించారు. స్వప్నపరిమళ్, పట్లోళ్ల నర్సింహులు, బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి, సందల్ రాజుగౌడ్ సంఘం సభ్యులతో కలిసి పూజలు ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి ప్రతినిధులు సంతోశ్ కుమార్, భానుకుమార్, రామకృష్ణ, నాయకులు ప్రభాకర్‌గౌడ్, రామకృష్ణ, ప్రవీణ్‌గౌడ్, పటేల్ కిరణ్, వేణుగోపాల్, శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులున్నారు.

వినాయక ఉత్సవాలను నిరాకరించడం తగదు

హిందూ వాహిని జిల్లా ఉపాధ్యక్షుడు సాయిగణేశ్

కుల్కచర్ల: ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్‌లో వినాయక ఉత్సవాలు నిర్వహించొద్దని ప్రిన్సిపాల్ విద్యార్థులకు చెప్పడాన్ని ఖండిస్తున్నామని హిందూ వాహిని జిల్లా ఉపాధ్యక్షుడు సాయిగణేశ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో ఆధ్యాత్మిక భావాలను విద్యార్థులకు అలవాటు చేయాల్సిన ప్రిన్సిపాల్..నిరాకరించడం ఎంత వరకు సమంజసమని మండిపడ్డారు. హిందూ సంప్రదాయాలకు విరుద్ధంగా ప్రిన్సిపాల్ వ్యవహరించడం తగదన్నారు. వెంటనే మోడల్ స్కూల్‌లో విద్యార్థులు వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసుకొని పూజలు నిర్వహించునేలా ప్రిన్సిపాల్ చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో జిల్లా హిందూ వాహిని ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

నేను కోరుకున్న జీవితం ఇది కాదు..

సూసైడ్ నోట్ రాసి యువకుడి ఆత్మహత్య

బంజారాహిల్స్: 'అమ్మా..నాకు ఈ జీవితం నచ్చడం లేదు..నేను కోరుకున్న లైఫ్ ఇది కాదు.. నా జీవితాన్ని ఇంకోరకంగా ఊహించుకున్నా..ఇప్పుడు జరుగుతున్నది వేరేగా ఉంది..నాకు నచ్చని ఈ బతుకు ముగించాలనుకుంటున్నాను' అంటూ ఓ యువకుడు సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్న ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వెస్ట్‌బెంగాల్‌కు చెందిన దేబషిష్ బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులో నిర్మాణంలో ఉన్న మంత్రి కన్‌స్ట్రక్షన్స్‌లో క్వాలిటీ కంట్రోలర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అదే ఆవరణలో గత కొంతకాలంగా ఒక గదిలో ఉంటున్నాడు. అయితే వారం రోజుల నుంచి అదోలా ఉంటూ..తనకు ఈ జీవితం నచ్చడం లేదంటూ సహచర సిబ్బందితో వాపోయేవాడు. అనుకున్న విధంగా బతుకు కొనసాగడం లేదని అశాంతితో గడుపుతూ చివరకు తల్లికి సూసైడ్ నోట్ రాసి తాను ఉంటున్న గదిలోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుంగ్‌ఫూ పోటీల్లో న్యూమాంక్స్ సత్తా

వేర్వేరు విభాగాల్లో ముగ్గురికి గోల్డ్‌మెడల్



మాస్టర్ రమేశ్‌తో విద్యార్థులు

కొందుర్గు: నగరంలోని యూసూఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ ఆల్ స్టైల్ కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో కొందుర్గు న్యూమాంక్స్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు మాస్టర్ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలికలు అండర్-12 కటాస్ విభాగంలో ఎదిర అనసూయ గోల్డ్ మెడల్, అండర్-14 బాలికల ఫైరింగ్ విభాగంలో నహీద్ గోల్డ్ మెడల్ సాధించారని తెలిపారు. బాలురు అండర్-16 ఫైరింగ్‌లో సాయితేజ గోల్డ్ మెడల్ సాధించగా అండర్-8 విభాగంలో ఎండీ ముజీబ్ ప్రతిభ చూపినట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను న్యూమాంక్స్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌పటేల్, తెలంగా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ బాల్‌రాజ్ అభినందించారు.

సామాజిక అంశాలపై అవగాహన

శంషాబాద్ రూరల్: మండలంలోని రామంజాపూర్‌లో సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు శనివారం రాత్రి నాటిక ప్రదర్శనతో పలు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. 'కృతజ్ఞత విలువ-వృద్ధాప్యంలో తల్లిదండ్రుల సంరక్షణ' అనే అంశంపై నాటకాన్ని ప్రదర్శించారు. తల్లిదండ్రుల ప్రేమ, త్యాగాలను గుర్తించుకుని వృద్ధాప్యంలో వారిని గౌరవిస్తూ సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

రైతుల కష్టం.. వర్షాలతో నష్టం



నావంద్గిలో నీట మునిగిన పత్తి పంట

- చేతికొచ్చిన పంటలు నీటిపాలు
- ఆదుకోవాలని అన్నదాతల వేడుకోలు

బషీరాబాద్: ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు వర్షాలకు పాడయ్యాయి. కోతకొచ్చిన పెసర, మినుము పంటలు నీటిపాలయ్యాయి. భారీ పెట్టుబడులతో సాగు చేసిన పత్తి పంటలు సగానికిపైగా నీట మునిగాయి. దీంతో తాము తీవ్రంగా నష్టపోయామని.. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక

బషీరాబాద్ మండల రైతులకు వర్షాధార పంటలే దిక్కు. వానాకాలంలో 32,728 ఎకరాల్లో పత్తి, కంది పెసర, మినుము పంటలు సాగుచేశారు. ఇందులో పత్తి 13,057 ఎకరాలు, కంది 14,885 ఎకరాలు, పెసర 1,269 మినుము 372 ఎకరాల్లో సాగు



వర్షాలకు పాడైన పెసర కాయ

చేశారు. వారం క్రితం కురిసిన భారీ వర్షాలకు సగానికి పైగా పాడైనట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పెసర, మినుము పంటలకు 90 శాతం నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగ్నా పరివాహక ప్రాంతాలైన మంతట్టి, కంసాన్‌పల్లి, జీవన్గి, క్యాద్గీరా, గంగ్వార్, నావంద్గి, ఇందర్‌చెడ్ పరిధిలో పత్తిపంటలు వరద ముంపునకు గురయ్యాయి. ఇదే విషయమై మండల వ్యవసాధికారిణి అనితను సంప్రదించగా పంటల నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపామన్నారు.

కాత మొలక వస్తోంది



నాలుగు ఎకరాల్లో పెసర పంట సాగు చేశా. కోత కొచ్చే సమయంలో ఎడతెరిపిలేని వర్షాలు కురియడంతో పంట పాడైంది. 70 శాతం మేర పంట నష్టం వాటిల్లింది. పొలంలో ఇప్పటికీ బురద ఉండడంతో పంట కోయడానికి సైతం వీలులేకుండా పోయింది. వర్షానికి తడిసి కాత మొలకెత్తుతోంది. గింజలు రంగుమారాయి. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

–నర్సింలు, రైతు, కాశీంపూర్

కంది పంట పాడైంది



కాగ్నానది పక్కన నాలుగు ఎకరాల్లో కంది పంట సాగు చేశా. భారీ వర్షాల కారణంగా కాగ్నానది ఉప్పొంగి పొలాలు వరద ముంపునకు గురయ్యాయి. కంది పంట పూర్తిగా పాడైంది. రూ.20 వేలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తే ఒక్క కంది మొలక మిగల లేదు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలి.

– భీంరెడ్డి, రైతు, నావంద్గి

హత్య కేసు.. కొత్తమలుపు!

- రెండో భర్తతో కలిసి మొదటి భర్తను హత్య చేసిన మహిళ
- నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు

మొయినాబాద్: అజీజ్‌నగర్ డెయిరీ ఫామ్‌లో జరిగిన హత్య కేసులో కొత్త కోణం వెలుగు చూసింది. ఫామ్‌లో పనిచేయడానికి వచ్చిన మహిళ తన మొదటి భర్తతో కలిసి రెండో భర్తను హత్య చేసినట్లు తెలుస్తోంది. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్‌లో ఉన్న సామ రాజిరెడ్డి డెయిరీ ఫామ్‌లో పని చేసే రాజేశ్‌కుమార్(24) శనివారం హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసులకు నిందితులను పట్టుకోవడం సవాలుగా మారింది. నిందితులు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని పారిపోవడంతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు అన్ని విషయాలను వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాయి.

నెల రోజుల క్రితమే..

అజీజ్‌నగర్‌లోని రాజిరెడ్డి డెయిరీ ఫామ్‌లో పనిచేసేందుకు బిహార్‌కు చెందిన ఏజెంట్ పవన్ ద్వారా నెల రోజుల క్రితం రాజేశ్‌కుమార్, పూనం దేవి దంపతులు వచ్చారు. అయితే తన మొదటి భర్త మహేశ్‌సాని అలియాస్ గుడ్డును వదిలేసిన పూనందేవి.. రాజేశ్‌కుమార్‌ను రెండో పెళ్లి చేసుకున్నట్లు సమాచారం. రాజేశ్‌కుమార్, పూనందేవి అజీజ్‌నగర్‌లోని డెయిరీ ఫామ్‌లో పనిచేస్తున్నారు. ఇటీవల రాజేశ్‌కుమార్ మద్యం తాగి తనను వేధిస్తున్నాడని పూనందేవి తన



హత్య జరిగిన డెయిరీ ఫామ్

మొదటి భర్త మహేశ్‌సానీకి ఫోన్ చేసి చెప్పింది. దీంతో ఈనెల 21న మహేశ్‌సాని అజీజ్‌నగర్ వచ్చాడు. అతను తమ బంధువని భర్తకు పరిచయం చేసింది. అదే రోజు రాత్రి ఇద్దరూ కలిసి రాజేశ్‌కుమార్‌ను హత్య చేసి, పారిపోయారు.

నిందితుల కోసం గాలింపు..

హత్య కేసు నిందితులను పట్టుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు మొదలు పెట్టారు. ఏజెంట్ పవన్‌తో ఫోన్‌లో మాట్లాడి పరారైన నిందితుల ఆచూకీ తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. పవన్ వద్ద హత్యకు గురైన రాజేశ్ కుమార్ వివరాలు మాత్రమే ఉన్నట్లు తెలిసింది. నిందితులు మహేశ్‌సాని, పూనందేవిల వివరాలు తనకు తెలియదని పోలీసులకు చెప్పినట్లు సమాచారం. దీంతో వీరు బిహార్ వెళ్లారా..? మరెక్కడైనా ఉన్నారా..? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు దొరికితేనే కేసు విషయాలు బయటకొస్తాయని పోలీసులు చెబుతున్నారు.

కనెక్షన్.. కలెక్షన్!

విద్యుత్ శాఖలో అవినీతి దందా

- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిని ముప్పు తిప్పలు పెడుతున్న వైనం
- నేరుగా సంప్రదిస్తే రూ.లక్షల్లో డిమాండ్
- డబ్బులిచ్చినవారికి వారం రోజుల్లోనే కనెక్షన్
- ఇవ్వనివారికి కాలయాపన చేస్తున్న అధికారులు, సిబ్బంది

మొయినాబాద్: విద్యుత్ శాఖలో అవినీతి దందా కొనసాగుతోంది. కొత్త కనెక్షన్ కోసం ఎవరైనా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే అధికారులు, సిబ్బంది వారిని ముప్పుతిప్పలు పెడుతున్నారు. నేరుగా వెళ్లి డబ్బులు ఇచ్చిన వారికి వెంటనే కనెక్షన్లు ఇస్తున్నారు. మొయినాబాద్, చిలుకూరు సెక్షన్లలో ఈ వ్యవహారం జోరుగా సాగుతోందనేఆరోపణలున్నాయి. నగర శివారులోని మొయినాబాద్ ప్రాంతంలో ఫాంహౌస్‌లు, ఇళ్ల నిర్మాణం అధికంగా కొనసాగుతోంది. వీటన్నింటికి కొత్త కనెక్షన్లు అవసరం. ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్ల వినియోగం పెరగడం వీరికి కాసుల పంట పండిస్తోంది.

రూ.లక్షల్లో డిమాండ్..

మొయినాబాద్ మండలంలో విద్యుత్‌శాఖకు రెండు సెక్షన్లు ఉన్నాయి. హైదరాబాద్– బీజాపూర్ రహదారికి కుడి వైపు చిలుకూరు సెక్షన్, ఎడమవైపు మొయినాబాద్ సెక్షన్ ఉన్నాయి. వీటి పరిధిలో పని చేసే విద్యుత్ అధికారులతోపాటు సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొత్తగా కమర్షియల్ కనెక్షన్ ఇవ్వడానికి రూ.1లక్ష నుంచి 1.50 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారు. ఏదైనా ఫాంహౌస్‌కు కనెక్షన్ ఇవ్వాలంటే ఏకంగా రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో కింది స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకూ వాటాలున్నట్లు సమాచారం.

డబ్బులు ఇవ్వకపోతే..

కొత్త విద్యుత్ కనెక్షన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వినియోగదారులను ఇబ్బంది పెడుతున్నారు. కమర్షియల్ కనెక్షన్ ఇవ్వాలంటే ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులో లేదని.. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ పెట్టుకోవాలని చెబుతున్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ పెట్టాలంటే రూ.5 లక్షలకు పైగా ఖర్చవుతుందని, లేదంటే రూ.1 లక్ష ఇస్తే కనెక్షన్ ఇస్తామని చెబుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో రూ.1లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు సమర్పించుకుని కనెక్షన్ తీసుకుంటున్నారు. ఇలాంటి వారికి వారంలో పని పూర్తవుతోంది. మిగిలిన వారికి ఆరు నెలలైనా అడుగు కదలడం లేదు.

మచ్చుకు కొన్ని..

- చిలుకూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కొత్తగా ఇంటి నిర్మాణం కోసం కమర్షియల్ విద్యుత్ కనెక్షన్ ఆ శాఖ సిబ్బందిని సంప్రదించాడు. ఇందుకోసం రూ.2 లక్షలు ఖర్చు అవుతాయని చెప్పడంతో ఖంగుతిన్నాడు. అంత ఇచ్చుకోలేనని బతిమాలడంతో రూ.1.50 లక్షలకు ఒప్పందం కుదిరింది. ముందుగానే డబ్బులు తీసుకున్న విద్యుత్ సిబ్బంది వారం రోజుల్లో మీటరు మంజూరు చేయించి కనెక్షన్ ఇచ్చారు.
- చిలుకూరు సెక్షన్ పరిధిలో ఓ యువకుడు గొర్రెల ఫామ్ ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందాలని భావించాడు. తన సొంత భూమిలో ఓ షెడ్డు నిర్మించుకున్నాడు. దీనికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని మూడు నెలల క్రితం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. నేరుగా విద్యుత్ అధికారులు, సిబ్బందిని కలవకుండా దరఖాస్తు చేసుకోవడంతో కనెక్షన్ ఇవ్వడం లేదు. కమర్షియల్ కనెక్షన్ ఇవ్వడానికి అవకాశం లేదని.. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ పెట్టుకోవాలని చెప్పారు. ఇందుకోసం రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పారు. ఎంతబతిమాలినా వినడం లేదు. ఇప్పటికీ అతనికి కనెక్షన్ ఇవ్వలేదు.
- మొయినాబాద్ సెక్షన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కొత్తగా నిర్మించుకున్న ఫాంహౌస్‌లో ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. అధికారులు ఎస్టిమేషన్ వేయడంతో నేరుగా పైఅధికారుల వద్దకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించుకున్నాడు. తనకు తెలిసిన కాంట్రాక్టర్‌తో ట్రాన్స్‌ఫార్మర్ బిగించే పనిని పూర్తి చేయించాడు. దీనికి కనెక్షన్ ఇచ్చే సమయంలో సిబ్బంది అతన్ని తీవ్ర ఇబ్బందులు పెట్టారు. ఇతర కాంట్రాక్టర్‌తో పనిచేయించుకున్నావు కదా.. అతనితోనే కనెక్షన్ ఇప్పించుకో అంటూ వెటకారంగా మాట్లాడారు. విద్యుత్ సిబ్బందికి డబ్బులు ఇచ్చిన తర్వాతే ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇచ్చారు.

లొసుగుల ముసుగులో వసూళ్ల పర్వం!

ఆస్తుల రిజిస్ట్రేషన్లలో లోపించిన పారదర్శకత

- ఒక్కో డాక్యుమెంట్‌కు ఒక్కో రేటు
- అక్రమాలకు నిలయంగా పలు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు
- ఏసీబీకి చిక్కుతున్నా మారని తీరు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఆస్తుల రిజిస్ట్రేషన్లలో పారదర్శకతకు పెద్దపీట వేయాల్సిన అధికారులు.. చిన్నచిన్న అంశాలను సాకుగా చూపించి పెద్దమొత్తంలో దోచుకుంటున్నారు. అనధికారిక వెంచర్లలో నాలా కన్వర్షన్ కాని ఖాళీ స్థలాలు, జీపీ లే అవుట్లలో ప్రజావసరాల కోసం వదిలిన పార్కు స్థలాలు, గ్రామ కంఠం భూముల్లో వెలసిన నిర్మాణాలు, లీగల్ హైర్‌లేని జీపీఏ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు వీరి పాలిట వరంగా మారాయి. దీంతో జిల్లాలోని పలువురు సబ్‌రిజిస్ట్రార్ల(ఎస్‌ఆర్‌ఓ)కు కాసుల వర్షం కురుస్తోంది. ఒక్కో డాక్యుమెంట్‌కు ఒక్కో రేట్ ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నారు.

మధ్యవర్తుల సాయంతో..

ఉమ్మడి జిల్లాలో నెలకు సగటున 22 వేల డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అవుతుండగా వీటిద్వారా ప్రభుత్వానికి రూ.360 కోట్లకుపైగా ఆదాయం సమకూరుతోంది. రిజిస్ట్రేషన్లు, ఆదాయం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇప్పించుకుంటున్న కొంతమంది ఇందుకోసం పెట్టిన ఖర్చును రాబట్టుకునేందుకు డాక్యుమెంటుకో రేట్ పెట్టి వసూలు చేస్తున్నారు. ఇటీవల ఇలా ఒక్క గండిపేటకే నలుగురు అధికారులు వచ్చివెళ్లారు. లీగల్ హైర్ లేని, పాత లే అవుట్లలో ఏలింకూ లేని ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్లకు రూ.పది లక్షల నుంచి రూ.పదిహేను లక్షల వరకు వసూలు చేస్తున్నారు. గ్రామ కంఠం, అర్బన్ సీలింగ్, 111 జీఓ పరిధిలోని భూముల్లో వెలిసిన బహుళ అంతస్తుల భవనాల్లోని ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు రూ.లక్ష చొప్పున వసూలు చేస్తున్నారు. ఇందుకోసం డాక్యుమెంట్ రైటర్లు, పర్సనల్



డ్రైవర్లను మధ్యవర్తులుగా నియమించుకుంటున్నారు. సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి బయలుదేరే సమయంలో మధ్యవర్తుల నుంచి సొమ్ము తీసుకెళ్తున్నారు.

మచ్చుకు కొన్ని..

- కోర్టు పరిధిలో ఉన్న సికిందర్‌గూడలో పది ఎకరాల వివాదాస్పద భూమికి రాత్రికి రాత్రే నాలా కన్వర్షన్ ఉత్తర్వులు జారీ చేయడం, ఓ తెల్ల కాగితంపై లే అవుట్ గీయడం, ఖాళీ ప్లాట్లకు బండ్లగూడ మున్సిపాలిటీ ఇంటి నంబర్లు జారీ చేయడం, ఆ వెంటనే 23 ప్లాట్లకు సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేయడం ఇటీవల స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. విలువైన ఈ ఆస్తుల రిజిస్ట్రేషన్లలో పెద్ద మొత్తంలో చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- లీగల్ హైర్ సర్టిఫికెట్ లేదనే సాకుతో రాళ్లగూడ ప్రకాశ్‌నగర్‌లోని 250 గజాల చొప్పున ఉన్న రెండు ఏజీపీఏ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు శంషాబాద్ ఎస్‌ఆర్‌ఓ ఆరు మాసాల క్రితం రూ.2 లక్షలు వసూలు చేశారు.
- మొయినాబాద్ సర్వే నంబర్ 176/23లోని 0.33 ఎకరాల లావణి పట్టా భూమిని, నిబంధనలకు విరుద్ధంగా నాలా కన్వర్షన్ చేయించారని, ఈ భూములకు సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ కూడా చేశారని, తమకు తెలియకుండా తమ భూములకు నాలా కన్వర్షన్ చేయించి, గుట్టుగా రిజిస్ట్రేషన్లు చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితులు నాగమ్మ, ఆమె ముగ్గురు కుమార్తెలు ఇటీవల హైకోర్టును ఆశ్రయించడం, ఆ మేరకు అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్ చేసే అధికారం సబ్ రిజిస్ట్రార్లకు లేదని ఆదేశాలు జారీ చేయడం కొసమెరుపు.

అక్రమార్కులపై వేటు

- శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 334, 335లో 5.12 ఎకరాల భూమి ప్రోగ్రెసివ్ ఆగ్రో సర్వీసెస్‌కు ఉండగా, 2023మార్చి 17న శంకర్‌పల్లి తహసీల్దార్ ఎండీ నయిమొద్దీన్ ద్వారా వ్యవసాయేతర భూమిగా మార్చుకున్నారు. ఆ తర్వాత మరో నలుగురు వ్యక్తులు కలిసి దీనికి నకిలీ పత్రాలు సృష్టించి 25,652 గజాల స్థలాన్ని ఇతరులకు విక్రయించారు. ఈ భూమిని వెంటనే రిజిస్ట్రేషన్ చేయాల్సిందిగా కోరుతూ అప్పటి జిల్లా రిజిస్ట్రార్ దొంత వెంకటేశ్వర ప్రసాద్ శంకర్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌పై ఒత్తిడి తీసుకొచ్చినట్లు విచారణలో తేలింది. అప్పటి హైదరాబాద్ జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు శ్రీనివాస్ కూడా అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో తేలడంతో వారిపై వేటు వేశారు.
- వికారాబాద్ జిల్లా తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కేవలం ఆరు రోజుల్లోనే 220 ప్లాట్లు రిజిస్ట్రేషన్లు చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ కటాఫ్ తేదీ(2020 ఆగస్టు 26) తర్వాత వెలిసిన లే అవుట్లలోని ప్లాట్లకు అంతకు ముందు తేదీలు వేసి, 25 శాతం రాయితీతో రిజిస్ట్రేషన్లు చేసి, ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో నష్టం చేకూర్చారు. అయితే డాక్యుమెంట్లను స్కానింగ్ చేయకపోవడంతో అనుమానం వచ్చి ఆరా తీయగా అసలు విషయం బయటికు పొక్కింది. ఈ ఘటనకు బాధ్యుడిగా పేర్కొంటూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఫసియొద్దీన్‌తో పాటు మరో ఉద్యోగిపై వేటు వేశారు.
- తుర్కయాంజాల్ పరిధిలోని 200 గజాల గ్రామ కంఠం భూమి రిజిస్ట్రేషన్‌కు రూ.70 వేలు లంచంగా తీసుకుంటూ నాలుగు రోజుల క్రితం వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ రాజేశ్ ఏసీబీకి చిక్కారు. ఈ కేసులో మధ్యవర్తిగా వ్యవహరించిన డాక్యుమెంట్ రైటర్‌ను కూడా పట్టుబడటం గమనార్హం.

ప్లైవుడ్ గోడౌన్‌లో భారీ అగ్నిప్రమాదం



రోబోటిక్ యంత్రంతో మంటలార్పుతున్న సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాటేదాన్ ప్రాంతంలో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్టకు చెందిన సలీమ్ గత ఏడు సంవత్సరాలుగా ఇక్కడ ప్లైవుడ్ కంపెనీని నిర్వహిస్తున్నాడు. ఇందులో మల్టీ పర్పస్‌గా వెల్డింగ్, ప్లైవుడ్, సోఫాల తయారీతో పాటు మేకలు, కోళ్లను పెంచుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా గోడౌన్‌లో మంటలు చెలరేగాయి. సమాచారం అందిన వెంటనే రాజేంద్రనగర్ అగ్నిమాపక అధికారి చంద్రనాయక్ నేతృత్వంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించారు. అలాగే చాంద్రాయణగుట్ట నుంచి అగ్నిమాపక కేంద్రంతో పాటు గౌలిగూడ నుంచి రోబోటిక్ యంత్రాన్ని రంగంలోకి దించి మంటలు అదుపు చేశారు. ప్రమాదంలో భారీగా ఆస్తినష్టం జరిగినట్లు తెలుస్తుంది. కొన్ని మూగజీవాలు మంటల్లో చిక్కుకుపోయి చనిపోయాయి. కోళ్లు, రెండు మేకలు మృతి చెందాయి. ప్రమాదానికి గల కారణంగా ఇంకా తెలియరాలేదని అగ్నిమాపక అధికారి చంద్రనాయక్ వెల్లడించారు. షార్ట్ సర్క్యూట్ కారణమై ఉంటుందని ప్రాథమికంగా భావిస్తున్నారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా కాటేదాన్‌లో ఫైర్ వాహనాలు వెళ్లే దారి సరిగా లేకపోవడంతో గౌలిగూడ నుంచి రోబోటిక్ యంత్రాన్ని తీసుకువచ్చి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించి మంటలు ఆర్పారు.

ప్రజాసేవే ఉద్యోగుల ధర్మం

చేవెళ్ల ఏసీపీ కిషన్



హోంగార్డు గణేశ్ దంపతులను సన్మానిస్తున్న ఏసీపీ కిషన్, ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి

మొయినాబాద్: ప్రజలకు సేవ చేయడమే ఉద్యోగుల ధర్మమని.. ప్రజలతో కలిసి పనిచేసే ఉద్యోగులను చిరస్థాయిగా గుర్తుంచుకుంటారని చేవెళ్ల ఏసీపీ కిషన్ అన్నారు. మొయినాబాద్ పీఎస్‌లో హోంగార్డుగా విధులు నిర్వహించిన గణేశ్ జూలై 31న ఉద్యోగ విరమణ పొందారు. ఆదివారం మొయినాబాద్‌లో ఆయన వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ కిషన్ మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ అనేది ఉద్యోగులకు సాధారణమే అయినా ఉద్యోగంలో ఉన్నప్పుడు చేసిన మంచి పనులన్నీ ఇలాంటిన సమయంలోనే గుర్తొస్తాయన్నారు. ప్రతి ఉద్యోగి ప్రజల గుండెల్లో నిలిచిపోయేలా సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ రెడ్డి, పోలీసు సిబ్బంది, గణేశ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఫతేసాగర్ చెరువులో ఆడ శిశువు మృతదేహం

మహేశ్వరం: మండల పరిధిలోని కోళ్లపడకల్ ఫతేసాగర్ చెరువులో ఆడ శిశువు మృతదేహం కలకలం రేపింది. ఆదివారం పొలాలకు వెళ్తున్న క్రమంలో చెరువులో తేలిన నెలలు నిండని శిశువు మృతదేహాన్ని పలువురు రైతులు గమనించారు. ఆవెంటనే మహేశ్వరం పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంల సాయంతో వివరాలు సేకరిస్తున్నారు. సమీప గ్రామాల్లోని కర్మాగారాలు, ఇటుక బట్టీల్లో వలస కూలీలు పనిచేస్తారని తెలుస్తోంది. ఆడ శిశువు అని తేలడంతో అబార్షన్ చేయించారా..? వివాహేతర సంబంధం నేపథ్యంలో బిడ్డను వదిలించుకున్నారా..? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఏఐ సహకారంతో రెచ్చగొట్టే చిత్రాలు

నిందితుడి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్స్ వినియోగించి, తమ ఫోన్‌లో రూపొందించిన అత్యంత అభ్యంతరకరమైన చిత్రాలను సోషల్ మీడియాలో వైరల్ చేసిన నిందితుడిని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఇతగాడు తమ వర్గాన్నే కించపరుస్తూ వీటిని సృష్టించాడని, ఫేస్‌బుక్‌తో పాటు ఇన్‌స్టాగామ్‌లోనూ షేర్ చేశాడని అధికారులు తెలిపారు. తాను మరో వర్గానికి చెందిన వ్యక్తిగా పేర్కొంటూ ఈ పోస్టులు చేసిన ఇతగాడు వైషమ్యాలు సృష్టించడానికి ప్రయత్నించినట్లు వివరించారు.

జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలి



చేవెళ్ల: మాట్లాడుతున్న దేవేందర్

చేవెళ్ల: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని ఏడాదికి రెండు జతల యునిఫాం, గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల 19, 20 తేదీలలో జిల్లాలోని తుర్కయంజాల్‌లో నిర్వహించనున్న మున్సిపల్ కార్మికుల రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం చేవెళ్ల మున్సిపల్ కార్మికుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా జి.నరేశ్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ నరేశ్, కోశాధికారిగా సిద్దమ్మ, ఉపాధ్యక్షులుగా దస్తగిరి, భాస్కర్, నర్సింలు, సహాయ కార్యదర్శులుగా జనార్ధన్, అఫ్జల్, మహేందర్, కిష్టయ్య, కమిటీ సభ్యులుగా మాణిక్యం, మల్లమ్మ, జంగమ్మ, అడివమ్మ, శివయ్య, శ్రీనివాస్ తదితరులను నియమించారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ఆమనగల్లు: ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను విస్మరిస్తోందని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.కిషన్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో యూనియన్ ఆమనగల్లు విభాగం 3వ మహాసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కిషన్ మాట్లాడుతూ.. ఏళ్ల నుంచి పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత లేదని.. చాలీ చాలని వేతనాలతోనే నెట్టుకొస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని.. రెండవ పీఆర్సీలో రూ.26వేల కనీస వేతనం అమలు చేయాలని, 60 ఏళ్లు పైబడిన, మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబసభ్యులకు ఉపాధి కల్పించాలని.. రూ.10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఇంజమూరి నర్సింహ, శివశంకర్, వగ్గు రవి, హంసమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా రవి, ప్రధాన కార్యదర్శిగా నర్సింహ, కోశాధికారిగా గోపాల్, ఉపాధ్యక్షురాలిగా హంసమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రశాంత్, సహాయ కార్యదర్శిగా గణేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా విజయ్‌కుమార్, సభ్యులుగా యాదమ్మ, పద్మ, సుగుణమ్మ, సుధాకర్, చిట్టిబాబు, రాములు, శివ, శ్రీను నియమితులయ్యారు.